ప్రజాశక్తి

బుధవారం 24 జులై 2024

8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖకు ద్రోహం

- 'ఉక్కు'కు ఊపిరి కరువు
- రైల్వే జోన్, మెట్రో రైలు ఊసేలేదు
- కేంద్ర బడ్జెట్‌పై ప్రజల ఆశలు ఆవిరి



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో


పార్లమెంట్‌లో మంగళవారం ఉదయం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2024-25 జిల్లా ప్రజలకు నిరాశే మిగిల్చింది. ఉత్తరాంధ్ర అభివృద్ధికి మూల బిందువుగా వుండే విశాఖలో పరిశ్రమల అభివృద్ధికిగానీ, స్టీల్‌ప్లాంట్‌ను బతికించడానికిగానీ తాజా బడ్జెట్‌లో ఎటువంటి ప్రకటనా లేదు. రైల్వేజోన్‌పై అయితే కాషాయ పెద్దలు ఆడుతున్నది దొంగ నాటకం అని మరోసారి రుజువైంది. రైల్వే జోన్ ఊసేలేదు. వాస్తవానికి రైల్వే జోన్ కోసం భూమి 2 చోట్ల (ముడసర్లోవలో 52 ఎకరాలు, డిఆర్ఎం ఆఫీసు సమీపం వైర్‌లెస్ కాలనీలో 10 ఎకరాలు) సిద్ధంగా ఉన్నా నిర్మాణ పనులకు కావాలనే కేంద్రంలోని బిజెపి ఆటంకం కల్పిస్తోందన్నది తాజా బడ్జెట్‌తో తేలిపోయింది. బడ్జెట్‌లో రైల్వేల అభివృద్ధికి అని మాత్రమే హౌస్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రస్తావించారు. నిర్దిష్టంగా రైల్వే జోన్ గురించిగానీ, విశాఖ మెట్రో పనులపైగానీ ఆమె మాట్లాడక పోవడంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు. అన్నిటికంటే ప్రాధాన్యత మిగతా 2లో..

విసిఐసికి దక్కని ప్రాధాన్యత

- బడ్జెట్‌లో హామీ ఇవ్వని కేంద్రం
- మౌలిక వసతులకు నిధుల సమస్య

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ 2024-25 బడ్జెట్‌లో జిల్లాకు సముచిత స్థానం ఇవ్వలేదు. జిల్లాను పారిశ్రామిక పరుగులు పెట్టిస్తామన్న మాటలు ఒట్టివేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తేలిపోయింది. విశాఖ-చెన్నయ్ పారిశ్రామిక కారిడార్(విసిఐసి)లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామంటూనే వైఎస్ఆర్ జిల్లా కొప్పర్తికి నిధులు ఇస్తున్నట్లు ప్రకటించి జిల్లాను విస్మరించింది. జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) మౌలిక సదుపాయాల కల్పనకు



ప్రణాళిక తయారుచేసినా నిధుల్లేకపోవడంతో ప్రతిపాదనలు ముందుకు కదలలేదు. నక్కపల్లి మండలంలో విసిఐసి పరిధిలోని ఐదు పంచాయతీలు, 11 గ్రామాల నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం, మెరుగైన ప్యాకేజీ, పునరావాసం ఈ నాటికీ కల్పించలేదు. ఎగుమతి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని అచ్యుతాపురం, నక్కపల్లి క్లస్టర్ల కింద రైతుల నుంచి భారీగా ప్రభుత్వం భూములు సేకరించింది. భూములు సేకరించి సంవత్సరాలు గడిచిపోతున్నా మౌలిక సదుపాయాలు కల్పించలేదు. అచ్యుతాపురం క్లస్టర్‌లో ప్రయివేటు భూమి 1749.51 ఎకరాలు, ప్రభుత్వ భూమి 781.27 ఎకరాలు కలిపి 2530.78 ఎకరాలు, నక్కపల్లి క్లస్టర్‌లో జిరాయితీ భూమి మిగతా 2లో..

మోసపూరిత బడ్జెట్ : సిపిఎం

ఎంవిపి.కాలనీ, అనకాపల్లి విలేకరులు : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను మోసపూరితమైనదిగా సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, కె.లోకనాథం పేర్కొన్నారు. ఈ మేరకు వారు వేర్వేరుగా మంగళవారం ప్రకటనలు విడుదల చేశారు. తాజా బడ్జెట్‌లో విశాఖకు, ఉత్తరాంధ్రకు నిధులు కేటాయించకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం మరోసారి దగా చేసిందని మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ నుంచి ఉపసంహరిస్తూ ప్రకటన చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. బడ్జెట్ నుంచి ప్లాంట్‌కు నిధులు కేటాయించకుండా తీవ్ర ద్రోహం చేశారని తెలిపారు. ఉక్కుపై మంచి వార్తను ఆశించిన ప్రజలకు, కార్మికులకు నిరాశే మిగిలిందని తెలిపారు. ఈ ద్రోహంపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించకుండా రాజధానికి ఆర్థిక సహాయం చేస్తున్నారని తబ్బిబ్బయిపోతూ కేంద్ర ప్రభుత్వాన్ని కీర్తించడం తీవ్ర ఆందోళన మిగతా 2లో..

కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు ఐద్వా ఘన నివాళి

వార్త 8లో..

కేంద్ర బడ్జెట్‌పై సిపిఐ నిరసన

వార్త 2లో..

పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి

వార్త 8లో..



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

తీర ప్రాంతాన్ని ధ్వంసం చేయొద్దు

- సిజెడ్ఎంపి నోటిఫికేషన్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, మత్స్యకారులు
- ప్రజలు లేకుండా నాలుగు గోడల మధ్య కార్యక్రమం ఏర్పాటు చేయడంపై మండిపాటు

వార్త మెయిన్‌లో..

కొత్త అధికారులొచ్చారు..

జివిఎంసి కమిషనర్‌గా సంపత్ కుమార్, విఎంఆర్‌డిఎ కమిషనర్‌గా విశ్వనాథన్, జిసిసి ఎమ్‌డిగా కల్పనా కుమారి బాధ్యతల స్వీకరణ





బాధ్యతలు చేపట్టిన సంపత్ కుమార్, విశ్వనాథన్, కల్పనాకుమారి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ నగరంలో ప్రధాన ఉన్నతాధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. జివిఎంసి నూతన కమిషనర్‌గా పి.సంపత్ కుమార్ జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా విశాఖపట్నం నగర ప్రజల ఆకాంక్షలకు, నగర అభివృద్ధికి అనుగుణంగా పనిచేస్తానని అన్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ నగరం ఎంతో సుందరమైనదని, ఇక్కడ ప్రజలు చాలా సౌమ్యులని పేర్కొన్నారు. 25 లక్షల జనాభా కలిగిన మహా విశాఖ నగరానికి జివిఎంసి కమిషనర్‌గా తనకు మంచి అవకాశం వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకొని పని చేస్తానని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ మిషన్ డైరెక్టర్‌గా ఉన్న సమయంలో విశాఖ నగరంలో పర్యటించిన విషయం గుర్తు చేసుకున్నారు. నగరంలో లెగసీ వేస్ట్ సమస్య పరిష్కారానికి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖకు ద్రోహం

అంశంగా ఉన్న విశాఖ జీవనాడి ఉక్కు కర్మాగారానికి నిధులు గురించి ఊసే లేకుండా పోయింది. దీన్ని బట్టి కేంద్రం గతంలో చేసిన ప్రైవేటీకరణ నిర్ణయానికే కట్టుబడి ఉందన్నది అర్థమవుతోంది. ప్లాంట్‌కు సొంత గనులు ఇస్తానని గానీ, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి బ్యాంకు రుణాలు ఇస్తామనిగానీ ఎక్కడా హామీ ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకం ఉండదంటూ కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించి వెళ్లాక కూడా స్టీల్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాటమాత్రమైనా ప్రస్తావించకపోవడం ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగినట్లే. వైజాగ్ పోర్టుకు గత ఎన్నికల ముందు బడ్జెట్‌లో రూ.150 కోట్లు సవరించిన అంచనాలతో ప్రకటించినా ఇంతవరకూ నిధులు విడుదల కాలేదు. ప్రస్తుత బడ్జెట్‌లో సవరించ బడ్డ అంచనాలతో ఎంత నిధులు వస్తాయో అని పోర్టు అధికారుల్లో చర్చ జరుగుతోంది. మెట్రో రైలు ప్రాజెక్టులో భాగంగా విశాఖలో కార్యాలయం మూడేళ్లగా నడుస్తోంది. ఉన్నతాధికారిని గత ప్రభుత్వం నియమించింది. అధికారి ఉండి మెట్రోకు మోక్షం కలగలేదు. రైల్వే జోన్ పనులు ప్రారంభం అయ్యేందుకు తొలుత జనరల్ మేనేజర్ స్థాయి అధికారిని కేటాయించాల్సి ఉంది. ఈ ప్రకటన కూడా ఎక్కడా జరగలేదు. సౌత్ కోస్ట్ రైల్వే జోన్ విశాఖ కేంద్రంగా ప్రకటించి సుమారు ఎనిమిదేళ్లు కావొస్తున్నా బడ్జెట్‌లో ఏనాడూ పనులు ముందుకు సాగే నిధుల కేటాయింపు జరగలేదు. విశాఖపట్నం జిల్లాలో ఏడు అసెంబ్లీ సీట్లను కూటమికి కట్టబెట్టినా, విశాఖ పార్లమెంట్ సభ్యునిగా ఐదు లక్షల మెజారిటీతో టిడిపి అభ్యర్థిని గెలిపించినా ఏం ప్రయోజనం..? అంటూ పలువురు మండిపడుతున్నారు.

కోతలే.. కోతలు..

గత బడ్జెట్‌లో విశాఖ పోర్టు ట్రస్టుకు రూ.276 కోట్లు కేటాయించిన కేంద్రం మంగళవారం నాటి బడ్జెట్‌లో రూ.150 కోట్లకు కుదించి రూ.126 కోట్లు కోత పెట్టింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు గత బడ్జెట్‌లో రూ 683 కోట్లు కేటాయించగా తాజా బడ్జెట్‌లో రూ.620 కోట్లకు కుదించారు. విశాఖ పెట్రోలియం యూనివర్సిటీకి గత బడ్జెట్‌లో కేటాయింపులనే రూ.168 కోట్లుగా అలా ఉంచారు. వెనుకబడిన ప్రాంతాలకు నిధులను కేటాయిస్తామంటూ ఒక మాటను కేంద్ర మంత్రి నిర్మలమ్మ వదిలివెళ్లిపోయారు.

విసిఐసికి దక్కని ప్రాధాన్యత

2,380.81 ఎకరాలు, ప్రభుత్వ భూమి 1737.82 ఎకరాలు కలిపి 4,318.63 ఎకరాలు ఎపిఐఐసి సేకరించింది. అచ్యుతాపురం క్లస్టర్‌లోని రెండు దశల్లో రాంబిల్లి మండలం గోరపూడి, జెడ్.చింతువ, లాలంకోడూరు, కృష్ణపాలెంలలో అభివృద్ధి చేయాలని ప్రణాళిక తయారుచేశారు. రూ.152 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఫార్మాస్యూటికల్, కంట్రోల్ ఎక్విప్‌మెంట్, వైద్య పరికరాలు, సోలార్ పేనల్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలు వస్తాయని వేసిన అంచనా కార్యరూపందాల్చలేదు. నక్కపల్లి క్లస్టర్‌లోని రూ.490 కోట్లతో 1120 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా కింద చందనాడ, వేంపాడు, డిఎల్.పురం, రాజయ్యపేట, బుచ్చిరాజుపేటలో మౌలిక వసతులు కల్పనకు ప్రణాళిక తయారుచేశారు. మరో 3198.63 ఎకరాల్లో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసిడిసి)ను అభివృద్ధి చేయడం ద్వారా పెట్రో కెమికల్స్, ఇతర పరిశ్రమలకు పెట్టుబడులు భారీగా వస్తాయని భావించారు. ఫార్మాస్యూటికల్స్ కంపెనీలు, ఏరోస్పేస్, డిఫెన్స్, మెషినరీ ఫ్యాబ్రికేషన్స్, కాస్టింగ్ అండ్ ఫోర్జింగ్ వంటి పలు యూనిట్లు రావడంతో ప్రాథమికంగా వేల మందికి ఉపాధి లభిస్తుందని ఆశించినా, మౌలిక వసతుల కల్పనకు నిధులు విడుదల చేయకపోవడంతో ఇదొక కలగా మిగిలిపోయింది.

మోసపూరిత బడ్జెట్ : సిపిఎం

కలిగిస్తోందన్నారు. విభజన హామీలలో ఒకటైన విశాఖ మెట్రో రైలుకు ఈ బడ్జెట్‌లో మొండిచేయినే మిగిలిందన్నారు. విశాఖ రైల్వే జోన్ ఊసే లేకుండా పోయిందని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మాటలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గిరిజన యూనివర్సిటీకి ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా యుజిసి అకౌంట్‌లో కలపడం ద్వారా తీవ్ర హానిచేసిందన్నారు. భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖకు తీరప్రాంత రోడ్డు నిర్మాణానికి కూడా నిధులు కేటాయించలేదని తెలిపారు. విశాఖ స్మార్ట్ సిటీకి మొండిచేయి చూపారన్నారు. విశాఖలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థకీ బడ్జెట్ సపోర్టు అకౌంట్ నుండి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. వాస్తవానికి రాష్ట్రానికి కేటాయించే నిధులు స్పష్టంగా పేర్కొనబడలేదని తెలిపారు. టిడిపి, జనసేనలు కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలో ఉన్నప్పటికీ కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలకు అనుగుణంగా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

డాక్టర్ మురళీమోహన్‌కు పురస్కారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నగరానికి చెందిన వైద్యులు డాక్టర్ ఎంవివి.మురళీమోహన్‌కు జాతీయ స్థాయి పురస్కారం లభించింది. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ సౌరభ్ వర్షీ నుంచి ఈ మేరకు ఆయన పురస్కారంతో పాటు ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. డాక్టర్ మురళీ మోహన్ ఎఐఐఎంఎస్ జార్ఖండ్‌లోని దేవఘర్‌లో గిరిజన సంఘాల్లో పొగాకు వాడకంపై ఒకటో జాతీయ సదస్సులో ఈ-పోస్టర్‌ను సమర్పించారు. జాతీయ స్థాయి సదస్సులో ఆయనకు రెండో స్థానం దక్కింది. డాక్టర్ ఎల్.స్వస్తిచరణ్, డాక్టర్ పరమితసేన్ గుప్తా, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న మురళీమోహన్

బడ్జెట్‌పై సిపిఐ నిరసన


ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మంగళవారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ సిపిఐ శ్రేణులు విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద మంగళవారం సాయంత్రం నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.47.65 లక్షల కోట్లు అంచనాతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెబుతున్నా నమ్మశక్యంగా లేదన్నారు. అత్యంత ముఖ్యమైన పోలవరం కోసం ఒక్క రూపాయినీ కేటాయించలేదన్నారు. విశాఖ ఉక్కు, రైల్వే జోన్ ఊసే కానరాలేదన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నిరసన చేపడుతున్న సిపిఐ నాయకులు

నూతన క్రిమినల్ చట్టాలను సవరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త క్రిమినల్ చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం సవరించాలని, పౌరుల హక్కులకు రక్షణ కల్పించేలా మార్చాలని, అసెంబ్లీలో పోలీసులకు అపరిమిత అధికారాలను తగ్గించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాం ప్రసాద్ సిఎం చంద్రబాబును కోరారు. మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేకంగా ఈ చట్టాలపై చర్చించి తగు నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వాలు ఆ చట్టాల్లో ఉన్న లోపాలను పరిశీలించి రివ్యూ కమిటీలను ఏర్పాటు చేశాయన్నారు. ఆ విషయాన్నింటిపైనా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తరుపు నుంచి పలు సూచనలు చేస్తూ సిఎం చంద్రబాబుకు రాసిన లేఖను విడుదల చేశారు. ముఖ్యంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసే విషయంలో పోలీసులకు విశేషమైన అధికారాలను సెక్షన్ 173 ఇస్తుందని, యాసిడ్ దాడి బాధితులకు మూడు ఏళ్ల నుండి ఏడేళ్ల వరకు శిక్ష విధించే అవకాశం ఉన్న కేసుల్లో పోలీసుల ప్రాథమిక విచారణ జరపాలని కొత్త నిబంధనల్లో చెప్పలేదని, రాజద్రోహ నేరాన్ని తగ్గించి దాని స్థానంలో అదే మాదిరిగా అంతకన్నా ఎక్కువగా దేశద్రోహ నేరాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఈ నిబంధనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే అవకాశం ఉందన్నారు. తక్షణమే లేఖలో పేర్కొన్న పలు అంశాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి చట్టాల్లో అవసరమైన మార్పులను తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 246(2) ప్రకారం రాష్ట్ర శాసనసభకు ఈ చట్టాలను మార్పు చేసే అధికారం ఉందని, ఆ ఆర్టికల్‌ని ఉపయోగించి చట్టంలో రాష్ట్ర ప్రభుత్వం సవరణలను తీసుకురావచ్చునని తెలిపారు.



లేఖను చూపుతున్న మంత్రి శ్యాంప్రసాద్

5 నుంచి డిఎస్‌సి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, యుటిఎఫ్ సహకారంతో రెండు నెలల పాటు డిఎస్‌సి శిక్షణ తరగతులు నడపనున్నట్లు కోర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ గంగరాపు ప్రియాంక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ నేపథ్యంలో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంతో మందికి ఉద్యోగ కాంక్ష ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు కారణంగా శిక్షణ పొందలేకపోతున్నారని, అలాంటి వారికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కోచింగ్‌లో భాగంగా ఎస్‌జిటి, ఎస్ఎ సోషల్, తెలుగు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రముఖ అనుభవిజ్ఞులతో సైకాలజీ బోధించబడుతుందని తెలిపారు. రోజువారీ పరీక్షలు నిర్వహించ బడతాయని, మెటీరియల్ ఇవ్వబడుతుందని తెలిపారు.

ఆగస్టు 5 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని, దానికంటే ముందు 4న అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు 8374537181, 9347205549 నెంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

స్వల్ప ఫీజుతో రష్యాలో ఎంబిబిఎస్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రష్యాలోని మూర్మోన్స్ స్టేట్ యూనివర్సిటీలో ఎంబిబిఎస్ చదవాలనుకునే మధ్యతరగతి విద్యార్థులకు స్వల్ప ఫీజులతో అవకాశం కల్పిస్తున్నట్లు ఆ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటర్ విక్టోరియా పిక్సెందావా తెలిపారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఈ మేరకు అవగాహనా సదస్సు నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో తలపెట్టిన రిలే దీక్షలు మంగళవారానికి 1258వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసి కార్యకర్తలు కూర్చున్నారు. వారినుద్దేశించి మంత్రి శంకర నారాయణ మాట్లాడారు.

నైపుణ్య శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్థానిక యువతను సాధికారత దిశగా నడిపించాలన్న ఉద్దేశంతో ప్రముఖ సిమెంట్ కంపెనీ దాల్మియా భారత్ లిమిటెడ్ (డిబిఎల్)కి చెందిన సిఎస్ఆర్ విభాగం, దాల్మియా భారత్ ఫౌండేషన్ (డిబిఎఫ్) తమ నూతన నైపుణ్య శిక్షణ బ్యాచ్‌ను సిరిపురంలో ప్రారంభించాయి.

కొత్త అధికారులొచ్చారు..

(మొదటి పేజీ తరువాయి..) చర్యలు చేపడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌లో విశాఖ నగరాన్ని మొదటి ర్యాంకులో నిలుపుతానన్నారు. విశాఖ నగర మార్పునకు వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుని పనులను పూర్తి చేస్తానన్నారు. అనంతరం జివిఎంసి డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్ లీడర్లు, పలువురు కార్పొరేటర్లు, జివిఎంసి ఉన్నతాధికారులు, ఉద్యోగులు, పత్రికా ప్రతినిధులు ఆయన్ని కలిసి పుష్ప గుచ్ఛాలను అందించారు.

విఎంఆర్‌డిఏ కమిషనర్‌గా కెఎస్.విశ్వనాథన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, పర్యవేక్షక ఇంజినీర్ బలరామరాజు, డిఎఫ్ఓ శాంతి స్వరూప్, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, సియుపి సంజయ రత్నకుమార్, పలువురు అధికారులు, సిబ్బంది ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మొదటి రోజు విధుల్లో భాగంగా పరిపాలనా విభాగం, అర్బన్ ఫారెస్ట్రీ విభాగపు సమావేశంలో పాల్గొని ఆయా విభాగాల సిబ్బంది వివరాలు, విధివిధానాలను సమీక్షించారు.

గిరిజన సహకార సంస్థ (జిసిసి) నూతన ఉపాధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్‌గా కల్పనా కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిసిసి అధికారులు, సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె జిసిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, సంస్థ అమలు చేస్తున్న కార్యక్రమాల గురించి వివిధ అంశాలపై చర్చించారు. అరకువ్యాలీ కాఫీ, మార్కెటింగ్ ఇతర అంశాలపై ప్రస్తుతం నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

నారుమడుల్లో వర్షపు నీటిని తీసేయాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

పద్మనాభం : నారు మడుల్లో వర్షపు నీరు ఎక్కువగా చేరితే ఐదు రోజులలోపు ఆ నీటిని పూర్తిగా తీసేయాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు విశాలక్షి, పద్మావతి చెప్పారు. పద్మనాభం మండలంలోని అనంతవరం గ్రామంలో మంగళవారం వరి నారును వారు పరిశీలించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాల వల్ల నారు మళ్లకు ఎటువంటి నష్టం లేదని తెలిపారు. ప్రస్తుతం నారు మడులపై తీసుకోవలసిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. 5 సెంట్లు నారు మడికి కిలో యూరియా, కిలో ఫొటాష్ వేయాలని, 1 గ్రాము కార్బడైజమ్ మందును 1 లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, నారు ఎరుపు రంగులో ఉండి పసుపు ఆకులు ఎక్కువగా కనిపిస్తే 2 గ్రాముల జింక్‌సల్ఫేట్‌ను ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వారం రోజుల్లో నారు తీస్తామనగా 5 సెంట్లు నారు మడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ వాసన లేని గుళికలను వేసుకోవాలన్నారు. దీని వల్ల ప్రధాన పొలంలో వరి నాట్లు వేసిన తరువాత 30 రోజుల వరకు పీక పురుగు, ఆకుముడుత తదితర చీడపీడలు ఆశించవని తెలిపారు.

భీమిలి ఎడిఎ బి.విజయప్రసాద్ మాట్లాడుతూ, ఎరువులు యాజమాన్య పద్ధతిని వివరించారు. దమ్ములో 1 బస్తా డిఎపి, లేదా రెండు బస్తాలు సింగల్ సూపర్ పాస్ఫేట్ తప్పకుండా వేయాలన్నారు. 20 కేజీలు యురియా, 15 కేజీలు ఫొటాష్ వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు చదువుల సుబ్రమణ్యం, శశి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభం మండలం అనంతవరంలో సూచనలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

గ్రామాల్లో వ్యవసాయాధికారుల పర్యటన

భీమునిపట్నం : ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖాధికారులు మంగళవారం మండలంలోని తాటితూరు, టి.నగరపాలెం గ్రామాల్లో పర్యటించి వరి పంట పొలాలను పరిశీలించారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వరి పంట పొలాలు నారు మడి దశలో ఉన్నట్లు గుర్తించారు. విత్తనం చల్లిన 2,3 రోజుల వయసులో, మూడు రోజులు కంటే ఎక్కువ నీట మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందని, వీలైనంత త్వరగా నీటిని బయటకు తరలించాలని రైతులకు సూచించారు. విత్తిన 7 నుంచి 30రోజుల మధ్యలో నారు 5 రోజుల కంటే ఎక్కువ రోజులు మునిగితే నారు దెబ్బతినే అవకాశముందని తెలిపారు. మునిగిన నారు మడి లోంచి 5 రోజుల్లోపు నీరు బయటకు తరలించాలని రైతులకు సూచించారు. వరి పంట పొలాలను పరిశీలించిన వారిలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి విజయ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.శివకోమలి, ఆర్ బి కె సిబ్బంది ఉన్నారు.

ఆధార్ మెగా డ్రైవ్ ప్రారంభం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం లోడగలవానిపాలెం సచివాలయంలో ఆధార్ మెగా డ్రైవ్ కార్యక్రమాన్ని ఎంపిడిఒ నల్లారి అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 27వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ఉంటుందని, ఐదేళ్లు నిండిన వారు ఆధార్ బయోమెట్రిక్ చేయించుకోవాలని, వారు 10వ తరగతి పూర్తయిన వెంటనే ఒక సారి, 18 సంవత్సరాలు దాటిన వెంటనే మరొకసారి బయోమెట్రిక్ చేయించు కోవాలని చెప్పారు. 25 ఏళ్లు దాటిన వారు ఇంతవరకు ఎటువంటి డాక్యుమెంట్లు అప్డేట్ చేయకపోతే ఓటరు కార్డు, బ్యాంకు పాస్ బుక్‌తో ఆధార్ క్యాంప్‌కు హాజరైతే డాక్యుమెంట్ అప్డేట్ చేస్తారని చెప్పారు.

మందకొడిగా నమోదు

మంగళవారం ప్రారంభమైన ప్రత్యేక డ్రైవ్‌లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సర్వర్ డౌన్ కారణంగా ఆధార్ నమోదు కార్యక్రమం మందకొడిగా సాగింది.



యువకులతో మాట్లాడుతున్న సిఐ గోవిందరావు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సిఐ గోవిందరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువు, ఆటలపై దృష్టి పెట్టాలని ఆరిలోవ సిఐ గోవిందరావు సూచించారు. ఆరిలోవ హెల్త్‌సిటీ మైదానంలో యువకులతో మంగళవారం ఆయన మాట్లాడారు. నేటి యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టి ఆశయాల సాధనకు కృషి చేయాలని హితువు పలికారు. తాత్కాలిక ఆనందాల కోసం జీవితాలను బలి చేసుకోవద్దన్నారు.

నవోదయలో విఎంసి సమావేశం



విఎంసి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- పిఎం పాలెం : కొమ్మాదిలో ఉన్న జవహర్ నవోదయలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ (విఎంసి) సమావేశం కమిటీ చైర్మన్ అయిన విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యాన నిర్వహించారు. కమిటీ సభ్యులైన డిఇఒ ఎల్.చంద్రకళ, విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపల్ ఈశ్వరి ప్రభాకర్, రోడ్లు భవనాల శాఖ కార్యనిర్వాక ఇంజినీర్ ఫణికుమార్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కమిటీ (పిటిసి) సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ డాక్టర్ వైఎస్.చంద్రశేఖర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యాలయానికి సంబంధించిన పలు విషయాలను వివరించారు. విద్యాలయానికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలైన విద్యార్థిని తేజశ్విని ఇటీవల బెంగళూరులో నిర్వహించిన పారా అథ్లెటిక్స్ పోటీల్లో లాంగ్ జంప్‌లో స్వర్ణ పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో రజిత పతకం సాధించినందుకు కలెక్టర్ ఎం.ఎన్ హరీంద్ర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. మైగ్రేషన్ కింద మధ్యప్రదేశ్ రాష్ట్రం, గుణ జిల్లా జవహర్ నవోదయ విద్యాలయం నుంచి వచ్చిన విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యాలయానికి అవసరమైన సహకారం అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

అప్పన్న నిత్యాన్న ప్రసాదానికి రూ.1,01,116 విరాళం

ప్రజాశక్తి-సింహాచలం : శ్రీ వరాహాలక్ష్మి నరసింహ స్వామి నిత్య అన్న ప్రసాదానికి లలితనగర్‌కు చెందిన వారణాసి మణికంఠ కుమారి, వారణాసి లలిత సంతోషి రూ.1,01,116 విరాళంగా అందించారు. పిఆర్‌ఒ ఆఫీస్‌లోని డోనర్ కౌంటర్‌లో నగదు చెల్లించి దీనిపై వచ్చే వడ్డీతో ఏటా ఫిబ్రవరి 27వ తేదీన తమ తల్లిదండ్రులు ప్రమీల శ్రీనివాస్ జ్ఞాపకార్థం అన్నదానం జరిపించాలని కోరారు. అనంతరం స్వామి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు ఆశీర్వదించారు.

కిల్కారి మొబైల్ సేవలపై అవగాహన



కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై అవగాహనలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి- ఆనందపురం : కిల్కారి మొబైల్ అకాడమి సేవలు వినేలా గర్భిణిలు, బాలింతలలో అవగాహన కల్పించాలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ జీవనరాణి కోరారు. కిల్కారీ మొబైల్ అకాడమీ సేవలపై ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణిగా ఉన్న నాలుగో నెల నుంచి బిడ్డ పుట్టిన తరువాత ఏడాది వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పిస్తారని, ఇది పూర్తిగా ఉచితం అని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఈ అకాడమీ పనిచేస్తుందన్నారు. ఎఎన్ఎం గర్భిణులను నమోదు చేసినప్పుడు ఇచ్చే మొబైల్ నెంబర్‌కు వివరాలు తెలియజేస్తారని చెప్పారు.

కిల్కారి మొబైల్ అకాడమీ రాష్ట్ర ప్రోగ్రాం అధికారి రాజు లంకపల్లి మాట్లాడుతూ, గర్భిణులు, బాలింతలు 01244451660, 14423 నెంబర్లకు కాల్ చేయవచ్చని, ఇది పూర్తిగా ఉచితం అని తెలిపారు. ఎఎన్ఎం వద్ద నమోదు చేసుకున్న నంబర్‌తో చేయాలని పేర్కొన్నారు. ఆశ కార్యకర్తలు కిల్కారి మొబైల్ అకాడమీ అందించే కోర్సును పూర్తి చేసి, పరీక్ష ఉత్తీర్ణత పొందాలని సూచించారు. విశాఖ జిల్లాలో నూరు శాతం ఆశలు ఉత్తీర్ణత పొందారని తెలిపారు. అకాడమీ ప్రాంతీయ అధికారి మోహనరావు, డిపిహెచ్ఎన్ఒ మనోరమ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులు డాక్టర్ ఎం.గంగు.నాయుడు, షహనాజ్ సాధీయ, జిల్లా కమ్యూనిటీ మొబలైజర్ మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు వలందపేటకు చెందిన వాసుపల్లి ఎల్లారావు (20) సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. భీమిలి ఎస్ఐ జి.హరీష్ కథనం ప్రకారం.. వాసుపల్లి మసేనమ్మ, పైడయ్యలకు నలుగురు కుమారులు ఉన్నారు. వీరిలో ఆత్మహత్య చేసుకున్న ఎల్లారావు నాల్గో కుమారుడు. పని లేకుండా ఖాళీగా ఉండడమెందుకని తరచూ తమ్ముడు పైడిరాజు అనడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లుగా భావిస్తున్నారు. సోమవారం రాత్రి 9గంటలకు ఇంట్లో గదిలో ఫోన్ చూసుకుంటూ ఉన్నాడు. భోజనానికి పిలిస్తే వస్తాను అని చెప్పినా ఎంతకీ రాలేదు. అప్పటికే వేసిన తలుపు తీయలేదు. తలుపుకు ఉన్న చిన్న రంధ్రం గుండా చూడగా ఎల్లారావు కాళ్లు కింద వేలాడు తూ కనిపించాయి. తలుపు బద్దలుకొట్టి లోపలకు వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఉన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే సంగివలసలోని అనిల్ నీరు కొండ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎస్ఐ హరీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డయాబెటిక్ రెటినోపతితో అప్రమత్తంగా ఉండాలి : డాక్టర్ రుద్వేజ్ పాండ్యా



ప్రజాశక్తి - ఆరిలోవ : డయాబెటిక్ రెటినోపతి కళ్లను ప్రభావితం చేసే తీవ్రమైన సమస్యగా పనిగణించాలని, దీనికి సకాలంలో చికిత్స అందించక పోతే దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉందని ఎల్వి.ప్రసాద్ కంటి ఆసుపత్రి రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ రుద్వేజ్ పాండ్యా తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డయాబెటిక్ వ్యాధి గ్రస్తుల్లో 17శాతం మంది భారతదేశంలోనే ఉన్నారని పేర్కొన్నారు. చక్కెర స్థాయి రక్తంలో ఎక్కువ కావటం వల్ల రెటీనా రక్తనాళాలు దెబ్బతిని కాంతిని గ్రహించే శక్తిని కోల్పోతాయని తెలిపారు. ఇది నెమ్మదిగా దృష్టి సమస్యలకు దారితీస్తుందని వివరించారు. డయాబెటిక్ ఉన్న వారు సాధారణ నేత్ర పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. డయాబెటిక్ రెటినోపతి ఎలాంటి లక్షణాలు కనిపించకుండా వృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రక్తపోటు నివారణ, పొగాకు ఉత్పత్తులు వాడకం నివారణ, బరువు నియంత్రణ చేయడం వంటివి డయాబెటిక్ రెటినోపతిని నివారించవచ్చని తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న కమాండర్ ఈశ్వరరావు

విపత్తుల్లో జాగ్రత్తలపై అవగాహన

ప్రజాశక్తి -తగరపువలస : విపత్తులు సంభవించేటప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది మంగళవారం భీమిలి మండలంలోని చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కల్పించారు. తుఫానులు, వరదలు, భూకంపాలు, సునామీ ఏర్పడే సమయంలో ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్‌డిఆర్ఎఫ్ 10వ బెటాలియన్ టీమ్ కమాండర్ ఈశ్వరరావు, సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రత్నం, విఆర్ఒ పి.శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, విజయ్‌కుమార్, నాయకులు సరగడ అప్పారావు పాల్గొన్నారు.

మందు బాబులకు జరిమానా

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రండ్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27 మంది మందుబాబులకు జరిమానా విధించారు. ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు ఆధ్వర్యాన డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా 27 మంది మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికారు. వీరికి భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ డి.సౌజన్య ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున 27 మందికి అపరాధ రుసుము విధించారు.



సభలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు, వేదికపై అశోక్ గజపతిరాజు

రూ.443.29 కోట్ల టర్నోవర్‌తో 'మహారాజా బ్యాంకు'

ప్రజాశక్తి-సీతమ్మధార : ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్ 24వ మహాజన సభ మంగళవారం సీతమ్మధారలోనిక్షత్రియ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.రామకృష్ణంరాజు మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరం అనగా 31 మార్చి 2024 నాటికి బ్యాంకు రూ.265.96 కోట్లు డిపాజిట్లు, రూ.177.33 కోట్ల రుణాలు ఇచ్చి, మొత్తం రూ.443.29 కోట్లు వ్యాపారం కలిగి ఉందని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4.02 కోట్ల స్థూల ఆదాయం ఆర్జించగా రూ.1.02 కోట్లు పన్ను చెల్లించి, రూ.3.00 కోట్లు నికర ఆదాయం ఆర్జించామని తెలిపారు. బ్యాంక్ మూలధనం రూ.14.15 కోట్లు, రిజర్వ్‌లు, ప్రొవిజన్‌లు కలిపి రూ.16.19 కోట్లతో నికర విలువ రూ.27.76 కోట్లుగా ఉందని పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 14 శాతం డివిడెండును ప్రకటించినట్లు తెలిపారు. మార్చి 31, 2025 నాటికి రూ.475 కోట్లు వ్యాపారం లక్ష్యంగా నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. ఈ సభలో ప్రత్యేకముగా ది మహారాజా కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్‌ను ది ఆదర్శ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుతో విలీనం చేయుట, తదనంతరం స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా ఆవిష్కరించుటకు సభ్యుల ఆమోదంతో తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ మహాజన సభకు బ్యాంక్ మొట్ట మొదటి సభ్యులు అయిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజు హాజరవడం సంతోషంగా ఉందన్నారు. సభకు పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కష్ణ ప్రసాద్, ది ఆదర్శ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ అధ్యక్షులు జి.మదనగోపాల స్వామి తదితరులు హాజరయ్యారని ఎం.రామకృష్ణంరాజు, జనరల్ మేనేజర్ ఎన్.ఎన్. సత్యనారాయణ తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో ఉద్యోగుల భాగస్వామ్యం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాల్లో ప్రభుత్వ ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు ఉద్యోగుల్లో నిట్టనిలువునా చీలిక తెచ్చేదని, దీనిని తక్షణమే కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని విరసం నేత బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ హత్య అనంతరం మత ప్రాతిపదికన సమాజంలో విభజన వాదాన్ని వ్యాప్తి చేసే ఆర్‌ఎస్‌ఎస్ మతవాద పోకడల అడ్డుకట్ట కోసం 1966లో 3/10 (ఎస్)ను విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్‌ఎస్‌ఎస్, ఆర్‌ఎస్‌ఎస్ ఏతరులుగా ఉద్యోగుల్లో చీలిక వస్తుందని, ఇది ఉత్పాదకతపై పడి దేశ అభివృద్ధి కుంటుపడుతుందని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌ను అంగీకరించని ప్రజలకు ప్రభుత్వ సేవల్లో న్యాయం జరగదని తెలిపారు.

సమస్యల రహితంగా ఎయును తీర్చిదిద్దుతాం : వీసీ శశిభూషణరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం: సమస్యల రహితంగా ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దుతానని ఏయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. మంగళవారం ఏయూ సైన్స్, ఫార్మశీ, న్యాయ కళాశాల పరిధిలో బోధన, బోధనేతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కళాశాలలో, విభాగాలలో విద్య సంబంధ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. బోధన, బోధనేతర సిబ్బంది బాధ్యతలు వర్సిటీ నిర్వహణలో ఎంతో కీలకమన్నారు. తక్షణం దృష్టి సారించి, పరిష్కరించాల్సిన అంశాలను ఎప్పటికప్పుడు విభాగాధిపతులు, ప్రిన్సిపల్స్ తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. హాస్టల్స్ నిర్వహణ, భోజన నాణ్యత, వసతి కల్పనపై వార్డెన్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. సక్రమంగా తరగతులు నిర్వహించాలని, అకడమిక్ క్యాలెండర్‌ను పటిష్టంగా అమలు చేయాలని, రీసెర్చ్ ప్రాజెక్టులకు దరఖాస్తు చేయాలని చెప్పారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో ఐఎస్ఒ ఆడిట్‌కి సంబంధించిన ఇంటర్నల్ ఆడిట్ ప్రారంభం అవుతుందని, సహకారం అందించాలని విభాగాధిపతులకు సూచించారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపల్స్ ఆచార్య ఎంవిఆర్ రాజు, కె.సీతామాణిక్యం, జి.గిరిజాశంకర్, విభాగాధిపతులు, బిఒఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాసరావు వర్ధంతి

ప్రజాశక్తి -ములగాడ : కవి, రచయిత, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శి నూనెల శ్రీనివాసరావు 4వ వర్ధంతిని 61వ వార్డు పరిధి గొల్ల వీధిలో సిపిఎం మల్కాపురం శాఖ ఆధ్వర్యాన నివాళులర్పించారు. నూనెల శ్రీనివాసరావు చిత్రపటానికి సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పైడిరాజు, జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, మల్కాపురంలో 16 కుల సంఘాలను ఐక్యం చేసి, టీవీ కేబుల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి అతి తక్కువ ధరలతో ప్రజలకు అందించారని గుర్తుచేశారు. శ్రీనివాసరావు ఉద్యోగం చేస్తూ సిఐటియు బలోపేతం కావడానికి కృషిచేశారన్నారు. కార్మికుల పక్షాన పోరాడారని తెలిపారు. మల్కాపురంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరమూ పనిచేశారని గుర్తుచేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పాటల ద్వారా ప్రభుత్వానికి తెలియజేసే విధంగా రచనలు చేశారన్నారు. పి.పైడిరాజు మాట్లాడుతూ, సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించగలిగిన నేత శ్రీనివాసరావు అని కొనియాడారు. అన్యాయాన్ని నిర్భయంగా ఎదిరించి మాట్లాడే వారన్నారు. శ్రీనివాసరావు ఆశయ సాధనలో మనమంతా నడవాలని పిలుపునిచ్చారు. శ్రీనివాసరావు మేనల్లుడు వి.సురేష్ మాట్లాడుతూ, మామయ్య సిపిఎంలోచేరి తన తాతగారైన నూనెల మహాలక్ష్మి ఆశయ సాధనంలో చివరిదాకా నడిచారని, తమను డివైఎఫ్ఐలో చేర్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు అక్క ఆదిలక్ష్మి, చెల్లి పి.లలిత, అదిక సంఖ్యలో అభిమానులు, ఎన్.ఉమ, అప్పనర్సమ్మ, లక్ష్మి, పి.సురేష్ కృష్ణారావు పాల్గొన్నారు.



కవి నూనెల శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గాజువాకలో పెద్ద కల్వర్టుల నిర్మాణం



జగ్గు సెంటర్ వద్ద పూర్తయిన కల్వర్టు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాకలో పాత కల్వర్టుల స్థానంలో పెద్ద కల్వర్టులు నిర్మిస్తున్నారు. గాజువాకలో వర్షం పడితే తరచూ రోడ్లపైన భారీగా నీరు చేరి ప్రజలకు ఇబ్బంది కలిగేది. దాని నుంచి శాశ్వత పరిష్కారం దిశగా జివిఎంసి అధికారులు పలుచోట్ల చిన్న కాలువలు లేకుండా, పెద్ద కల్వర్టులు నిర్మాణం చేపట్టారు. వర్షం నీరు రోడ్లపై నిల్వ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు. ప్రధానంగా జగ్గు సెంటర్, 100 అడుగుల రోడ్డు వద్ద కోర్టు ప్రాంగణం ముందు, కుంచుమాంబ కాలనీ వద్ద, కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. గతంలో తరచూ ఈ రోడ్లు ముంపునకు గురవుతూ ఉండేవి. గతంలో కుంచమాంబ కాలనీలో వర్షం పడితే కాలువలో నీరు ప్రవహించక రోడ్లపై ఉండేది. శాశ్వతంగా కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో ఆ సమస్య నేడు కనిపించడం లేదు. ఈ మధ్య కురిసిన వర్షాలకు కూడా, నీరు కాలువల ద్వారా ప్రవహించింది. ఇంకా పూర్తిస్థాయిలో పనులు జరిగితే ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్‌కుమార్‌ను పలువురు కార్పొరేటర్ మంగళవారం కలిసి అభినందనలు తెలిపారు. పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శాలువతో సత్కరించారు.

ఆరిలోవ : జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి.సంపత్‌కుమార్‌ను ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు ఆధ్వర్యాన 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. 18వ వార్డు కార్పొరేటర్ మంగవేణి, 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్నం అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

గాజువాక: జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సంపత్‌కుమార్‌ను 65, 71 వార్డుల కార్పొరేటర్లు బొడ్డు నరసింహ పాత్రుడు, రాజాన రామారావు మర్యాద పూర్వకంగా కలిశారు. వార్డుల్లో జరిగిన పనులను, చేపట్టాల్సిన అభివృద్ధిని కమిషనర్‌కు వివరించారు. రెండు వార్డుల్లో కొండవాలు ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, వాటికి తగినట్టుగా పనులు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

మధురవాడ : జివిఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన పి.సంపత్‌కుమార్‌ను 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వార్డులోని ముఖ్య సమస్యలను, కొండవాలు ప్రాంతాలలో మంచినీటి సదుపాయం కల్పించాలని, రాజీవ్ గృహకల్పలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, కుళాయిలు, వీధి దీపాల సమస్య, డంపింగ్ యార్డ్ సమస్యలను కమిషనర్‌కు హేమలత వివరించారు.



జివిఎంసి కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న కార్పొరేటర్లు

యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : వాంబేకాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను, అడల్ట్ బిసిజి.వ్యాక్సిన్, సెషన్ ప్లానింగ్, లబ్ధిదారుల జాబితాను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎనిమియాపై లబ్ధిదారులను గుర్తించి గర్భిణులకు ఐరన్ మాత్రలు అందచేయాలని ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సి-సెక్షన్ ప్రసవాలు నివారించాలని, ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వెయ్యాలని, ఓపి రిజిస్టర్లను రెగ్యులర్‌గా నిర్వహించాలని, స్టాప్ డయేరియా ప్రోగ్రాం మీద ప్రజలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన శివాలయం ప్రహరీ

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 65వ వార్డు పరిధి సంజీవిగిరి కాలనీ కొండపై ఉన్న ఉమా రామలింగేశ్వర ఆలయం ప్రహరీ కూలిపోయింది. మూడు రోజులుగా వర్షాలు పడుతుండడంతో గోడలు తడిసి ఒక్కసారి కూలింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయమూ జరగలేదు.

యుజిడి పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న యుజిడి పనులను తక్షణమే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సంబంధిత మంత్రిని కోరారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ, 2019వ సంవత్సరంలోనే గాజువాక నియోజవర్గం మొత్తంలో టిడిపి హయంలో యుజిడి పనులు పూర్తయ్యాయని తెలిపారు. చిన్నచిన్న పనులను పూర్తయ్యేలా చూడాలని కోరారు.

పేదలకు ఇళ్లు అందించాలి

ప్రజాశక్తి ములగాడ : పేదలకు ఇళ్లు అందించాలని 62వ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి మాలినాయుడు కోరారు. వార్డు పరిధిలో ఉన్న హుదూద్ ఇళ్లను మంగళవారం హౌసింగ్ ఏఈ సూర్యారావు పరిశీలించారు. రీ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా మజ్జి మాలినాయుడు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఇల్లు అందించడమే ప్రభుత్వం ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో అచ్యుతరావు, నీలంరాజు, శ్రీధర్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

'స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై స్పందించాలి'

ప్రజాశక్తి-మాధవధార : ఐఎఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై మానవ సమాజం స్పందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు కోరారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ప్రత్యేక అవసరాల వారికి రిజర్వేషన్ అనవసరం అని ఆమె అనడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితిగా మారిందని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాల ప్రజలు సాధారణ వ్యక్తుల కన్నా అన్ని రంగాలలో బాగా రాణిస్తారని తెలిపారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే వివరణ కోరాలని డిమాండ్‌చేశారు. వైద్య రంగంలో డాక్టర్ సురేష్ అంగుటి ముంబయికి చెందిన కేన్సర్ వైద్య నిపుణులు పద్మశ్రీ, పద్మభూషణ్ అందుకున్నారని, 2014 ఆల్ ఇండియా ఐఎఎస్‌లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన ఇరా సింగ్ హల్ ఢిల్లీలో నీతి అయోగ్‌లో చాలా బాగా పనిచేస్తున్నారని పలు ఉదాహరణలను వివరించారు. ఈ విషయమై మేధావులు, రాజకీయ నాయకులు, పత్రికాధినేతలు, స్పందించాలని కోరారు.

సిజెడ్ఎంపి, ఎల్‌యుఎల్‌సితో తీవ్ర నష్టం

- ప్రజాభిప్రాయ సేకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేత లోకనాథం తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

కోస్టల్ మేనేజ్‌మెంట్ ప్లాన్ (సిజెడ్ఎంపి), ల్యాండ్ యూజ్ ల్యాండ్ కవర్ (ఎల్‌యుఎల్‌సి) వల్ల తీవ్ర ప్రాంతానికి, ఆ ప్రాంత గ్రామాలకు, ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఆందోళన వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలోని సిజెడ్ఎంపి, ఎల్‌యుఎల్‌సి ఖరారు కోసం మంగళవారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ ప్రజాప్రాయ సేకరణను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ తీరప్రాంత మండలాల్లోని ప్రజలకు అందుబాటులో వుండే అనువైన ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణను ఏర్పాటు చేయకుండా, రాకపోకలకు అనువుగాలేని కలెక్టరేట్‌లో నిర్వహించడం సరికాదన్నారు. పర్యావరణ ప్రజాభిప్రాయసేకరణ నోటిఫికేషన్‌ను, సిజెడ్ఎంపి తయారీ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను గ్రామాల్లో సాంకేతికంగా ప్రదర్శించారు తప్ప వాటి లాభ, నష్టాలు ప్రజలకు తెలియజేసేందుకు గ్రామసభలు ఎక్కడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ పరిధిలో నక్కపల్లి, పాయకరావుపేట, రాంబిల్లి, ఎస్.రాయవరం, అచ్యుతాపురం, పరవాడ తీర ప్రాంత మండలాల్లోని సుదూరంగా ఉన్న గ్రామాలైన గుణుపూడి, ఈదటం, కేశవరం, కుమారపురం, మాసాపేట, పెంటకోట, రాజవరం, శ్రీరాంపురం, చందనాడ, చుక్కలవాని లక్ష్మీపురం, దోనివాని లక్ష్మీపురం, నెల్లిపూడి, పెదతీనార్ల, రాజయ్యపేట, కట్టుబోలు, మత్రిపాలెం, మురకాడ, రాజులఅగ్రహారం, చినఉప్పలం, పేటసూదిపురం, సర్వసిద్ధి, ఉప్పరాపల్లి, వాకపాడు, పూడిమడక, చాటమెట్ట, కలవలపల్లి, రాంబిల్లి, సీతపాలెం, జిరాయితీ చింతువ, చిప్పాడ, తంతడి, చీపురుపల్లి (ఈస్ట్), చీపురుపల్లి(వెస్ట్) ఉన్నట్లు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారని తెలిపారు. తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు కాలంలో నిర్వహించిన ఏ ప్రజాభిప్రాయ సేకరణలోనూ స్థానిక మత్స్యకార ప్రజలకు వాస్తవం చెప్పలేదని, నాడు ఉపాధిపై ఇచ్చిన హామీ అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టలేదన్నారు. తీర ప్రాంతాన్ని భవిష్యత్‌లో డబ్బున్న వారికి కట్టబెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగానే ఈ ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తున్నట్లు మత్స్యకారులు, తాము భావిస్తున్నామని చెప్పారు. తీర సహజసిద్ధ స్వభావం దెబ్బతినకుండా ప్రభుత్వం కాపాడాల్సివుందని, అభివృద్ధి పేరుతో ఇస్తున్న మినహాయింపులతో తీరం దెబ్బతినడంతో మత్స్యకారుల జీవనోపాధికి, వారి నివాసాలకు నష్టం కలుగుతోందని వాపోయారు. పర్యాటక అభివృద్ధి పేర నిర్మిస్తున్న రిసార్ట్స్, పెద్దపెద్ద భవనాలు, పరిశ్రమలతో మడ అడవులు, ఇసుక దిబ్బలు దెబ్బతింటున్నాయని, దీంతో తీర ప్రాంతానికి సమీపంలోని ప్రాంతాలు భవిష్యత్తులో సముద్రపు అలలకు నష్టపోతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. సిజెడ్ఎంపి మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వస్తే ఎల్‌యుఎల్‌సి ప్రకారం విఎంఆర్‌డిఎ, జివిఎంసి లే అవుట్లకు, ఇళ్లు, ఇతర నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నాయని ఆందోళన కలుగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, నాయకులు బుద్ధ రంగారావు, ఎస్ బ్రహ్మాజీ, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు జి.నాయనబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్.శివాజీ, సిపిఎం నక్కపల్లి మండల కార్యదర్శి ఎం.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో నిరసన

అచ్యుతాపురం : కోస్టల్ జోన్ మేనేజ్మెంట్ అథారిటీ డ్రాప్ నోటిఫికేషన్‌పై కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన అచ్చుతాపురం మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ ఆర్ రాము, నాయకులు కె.సోమునాయుడు మాట్లాడుతూ కోస్టల్ జోన్ పరిధిలోకి వచ్చే గ్రామ ప్రజలకు సమాచారం తెలపకుంట ప్రజాభిప్రాయ సేకరణ చేయడం దారుణమన్నారు. రాబోయే కాలంలో తీర ప్రాంతాన్ని పారిశ్రామికంగానూ పర్యాటక కేంద్రాలుగా మార్చేసి మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసే విధంగా ప్రభుత్వ ప్రతిపాదనలు చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, స్థానికులు

అనకాపల్లి అభివృద్ధిపై జివిఎంసి నిర్లక్ష్యం

అసెంబ్లీలో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి, భీమిలి మున్సిపాలిటీలు జీవీఎంసీలో విలీనం అయినప్పటికీ ఈ రెండు ప్రాంతాల్లో కనీసం అభివృద్ధిని జీవీఎంసీ పట్టించుకోవడంలేదని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆరోపించారు. అసలు ఈ రెండు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్నాయా అన్న విషయాన్ని అధికారులే మర్చిపోయారనే పేర్కొన్నారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో మంగళవారం ఆయన లేవనెత్తారు. కొత్త ప్రాంతాల అభివృద్ధిలో నిర్లక్ష్యం బాగా కనబడుతుందని, కనీస అవసరాలైన డ్రైనేజీలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖపట్నం నగరంలో మాదిరిగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పుడున్న డ్రైనేజీ వ్యవస్థలో కనెక్టివిటీ లేక డ్రైనేజీలు పారకపోవడంతో దోమల బెడద ఎక్కువ అయిందన్నారు. తద్వారా వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఎక్కువ ఉందని చెప్పారు. వీటిని నిర్మూలించి అభివద్ధి పథంలో ఈ రెండు ప్రాంతాల్ని నడిపించేందుకు ప్రభుత్వం వద్ద ఈ విధమైన ప్రణాళికలు ఉన్నాయో చెప్పాలని కోరారు. శాసనసభ్యులు లావనెత్తిన అంశాలపై సంబంధిత శాఖ మంత్రి నారాయణ వివరణ ఇస్తున్న సమయంలో అనకాపల్లి ప్రాంతానికి అత్యంత ఇబ్బందికరమైన మున్సిపల్ డంపింగ్ యార్డ్ అంశాన్ని కూడా లేవనెత్తారు. దేశంలోనే ఎక్కడా కూడా నగరం నడిబొడ్డున మున్సిపల్ ఆఫీసులో డంపింగ్ యార్డ్ నిర్వహణ ఉండదని ఒక్క అనకాపల్లి లోనే ఇలా ఉందని, వెంటనే దీన్ని తరలించేందుకు చర్యలు చేపట్టి అనకాపల్లి ప్రజలకు మేలు చేయాలని కోరారు.

హాస్టల్ సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో ఎస్సీ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని డివిఎంసి సభ్యులు రేబాక మధుబాబు మంగళవారం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో కనీసం మౌలిక వసతులు లేవని, వర్షాలకి హాస్టల్స్ పూర్తిగా పడిపోయే స్థితిలో ఉన్నాయని వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. జిల్లాలో దళితులు అసైన్డ్ భూములను అన్యాయంగా తీసుకున్నారని, వాటిపై సమగ్ర దర్యాప్తు జరిపి దళితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ రిపబ్లిక్ అండ్ పార్టీ మాడుగుల ఇంచార్జ్ ఎమ్. లోవ చందు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులకు రక్షణేదీ?

ప్రజాశక్తి-అనకాపల్లి : వినియోగదారుల హక్కుల రక్షణకు బడ్జెట్‌లో కనీస ప్రాధాన్యత లేదని కన్స్యూమర్ ఆర్గనైజేషన్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాంద్రేగుల వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ వినియోగదారులపై ఆధారపడి ఉందన్న విషయాన్ని గుర్తించకపోవడం సిగ్గుచేటన్నారు. ఆహార భద్రత నాణ్యత ప్రమాణాలు, ఈ-కామర్స్ వినియోగదారుల రక్షణ, వినియోగదారుల కమిషన్ల పరిపుష్టికి అధిక ప్రాధాన్యత ఇస్తామని, ఆహార కల్తీ నిరోధానికి నిధులు కేటాయిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ఊసెత్తకపోవడం విచారకరమని వెంకటరమణ పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్ పట్ల హర్షం

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పట్ల తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మల్ల సురేంద్ర, తెలుగు యువత పార్లమెంటరీ అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి హర్షం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల సాయం అందిస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు.

నిధులు రాబట్టడంలో జగన్ విఫలం

2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు కేంద్రాన్ని ఒప్పించి నిధులు రాబట్టడంలో జగన్మోహన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మల్ల సురేంద్ర విమర్శించారు. 23 మంది ఎంపీలు ఉన్నప్పటికీ కేంద్రం మెడలు వంచడం కాదు కదా జగన్ అండ్ కో ప్రశ్నించ లేక పోయిందన్నారు. చివరికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం అత్యంత సానుకూలంగా స్పందిస్తుందన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ మంగళవారం నిర్విహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ దోమలు మంచినీరు నిల్వ ఉన్నచోట గుడ్లుపెట్టి అభివృద్ధి చెందుతాయని, కనుక అవి పెరగకుండా ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు దోమతెరలు వాడాలని ఇంట్లో పొగ పెట్టి దోమలను తరిమి వేయాలని కోరారు. అనంతరం ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైద్యులు యశోద, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఇంటెన్సివ్ కోర్సు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లైవ్ ప్రాజెక్ట్‌లపై 45 రోజుల ఇంటెన్సివ్ కోర్సు నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డాటప్రో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ ఈ కోర్స్‌లో విద్యార్థులలో అత్యాధునిక నైపుణ్యాలను పెంపొందించడంలో ఇన్‌స్టిట్యూట్ నిబద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏఐ ప్రాక్టికల్ అప్లికేషన్‌ల గురించి సంపూర్ణ అవగాహన అందించడానికి, ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ పద్ధతులను కలిపి ఒక హైబ్రిడ్ లెర్నింగ్ మోడల్‌ను అందించడానికి ఈ ప్రోగ్రామ్ నిశితంగా రూపొందించామని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంటరావు మాట్లాడుతూ లైవ్ ప్రాజెక్ట్‌ల అమలు ద్వారా వారి కొత్త నైపుణ్యాన్ని కూడా ప్రదర్శించడం హర్షణీయమన్నారు. సి ఎస్ ఈ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్. కె. సుజాత మాట్లాడుతూ ఏఐ సర్వవ్యాప్త ప్రభావాన్ని , సామాజిక నిబంధనలు, కార్యాచరణ ఫ్రేమ్‌వర్క్‌లను మార్చగలదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్ ప్రసాద్, డీన్ అడ్మిన్ ఈశ్వర్ రావు, అకాడమిక్ కోఆర్డినేటర్ కృష్ణ నాగ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సభ్యత్వం రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని శ్రీదుర్గాంబ కో-ఆపరేటివ్ సొసైటీలో సభ్యత్వం పొందిన సభ్యులందరూ ప్రభుత్వ ఆదేశాల మేరకు సొసైటీ కంప్యూటరీకరణలో భాగంగా తమ సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలని సిఈఓ గొంప రమణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ సంఘ సభ్యులు తమ ల్యాండ్ పాస్ బుక్ (లేదా) 1బి (లేదా) భూమి పత్రం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, పాన్ కార్డ్, నామినీ ఆధార్ కార్డ్, సభ్యత్వ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌లను ఈ నెల 30లోగా సమర్పించాలని కోరారు. గడువులోగా పై పత్రాల జిరాక్స్ కాపీలు సమర్పించని పక్షంలో వారి సభ్యత్వం రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. సభ్యులకు ఏమైనా సమాచారం కోసం 9985096689, 9642323673, 8919040669, 8919417381 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం నేతలు అప్పారావు, అప్పలరాజు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో ఈ నెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు తుఫాన్, వర్షాలు కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు, కోశాధికారి గండి నాయన బాబు, నాయకులు బుద్ధ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అచ్చుతాపురం, మునగపాక, అనకాపల్లి, రాంబిల్లి మండలాల్లో వేసిన వరినారు, డ్రిల్ సీడ్ నీటి మునిగి విత్తనాలు ముక్కిపోయి మొలకెత్త కుండా పాడైపోవడం జరిగిందన్నారు. ఈ కారణంగా రైతులు ఎకరాకు ఏడు వేల నుండి ఎనిమిది వేల వరకు నష్ట పోయారని చెప్పారు. వరి పంట వేయాలంటే తిరిగి రైతులు వరి నారు చేయాలని, రైతుల దగ్గర విత్తనాలు అందుబాటులో లేవని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి తుఫాన్ కారణంగా వరి నారు మళ్ళు నష్ట పోయిన రైతులకు ఉచితంగా వరి విత్తనాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విత్తనాలు వేయడానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయాలని కోరారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

మునగపాక : అధికార యంత్రాంగం ముంపు ప్రాంతాలను పరిశీలించి నీట మునిగిన వరి నారుమడులను, ఎదజల్లిన వరి పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. మండలంలోని తిమ్మరాజుపేట, వాడ్రాపల్లి, మునగపాక ఆవ ఖండంలోని ముంపుకు గురైన వరి నాడు మడులను, ఎద చల్లిన ప్రాంతాలను స్థానిక రైతులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ ఐదు రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాలకు నారుమడులు, ఎదజల్లిన వరిచేలు మునిగిపోయే పరిస్థితులు ఉన్న నేటి వరకు అధికార యంత్రాంగం పరిశీలించేందుకు రాకపోవడం విచారకరమన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందచేయాలని డిమాండ్ చేశారు. ఆవఖండం ప్రాంతంలో నీరు పోయే కెనాల్స్ చిన్నవిగా ఉండటం వలన వరద నీరు పల్లప్రాంతానికి వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు కెనాల్స్‌ను పెద్దవి ఏర్పాటు చేసి వరద నీరు సులభంగా పలపు ప్రాంతానికి చేరుకునే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు టెక్కలి పెద్ద సూరప్పారావు, కోయిలాడ రమణబాబు, సూరిశెట్టి అప్పారావు, టెక్కలి గంగరాజు, బీసెట్టి అప్పారావు, మల్ల రాజారావు తదితరులు పాల్గొన్నారు.



నీట మునిగి మేటలు వేసి వరి నారును పరిశీలిస్తున్న బ్రహ్మాజీ



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మోహన్‌రావు

కౌలు రైతులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వారికి కూడా ప్రభుత్వపరంగా పలు రాయితీలు, రుణాలు కలిపిస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్‌రావు అన్నారు. మంగళవారం కే కోటపాడు లో కౌలు రైతు డోకల మోహన్‌రావుకు కౌలు కార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డుల కోసం రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు వీఆర్వోలను సంప్రదించాలన్నారు. అనంతరం వారాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి సోమశేఖర్, వీఏఏలు దొర, హరీష్, సుదీర్, పూజిత తదితరులు పాల్గొన్నారు.

సంచార వైద్య శిబిరం

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో మంగళవారం ఆర్కే హాస్పిటల్ ఆధ్వర్యంలో సంచార వైద్య శిబిరం నిర్వహించారు. దీనిని సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంపులను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. డాక్టర్ నాయుడు బాబు, కోఆర్డినేటర్ వేణు, చిన్న సుబ్రహ్మణ్యం వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు.

అక్రమ లేఅవుట్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడకలో పంచాయతీలో అనుమతులు లేని అక్రమ లేఅవుట్ల రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని జనసేన పార్టీ నాయకుడు ఎరుపల్లి కాసులు కిరణ్ జిల్లా కలెక్టర్‌కు, జిల్లా రిజిస్ట్రార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలోని 86, 126, 127 సర్వేనెంబర్లలో రెండు ఎకరాల 25 సెంట్లు భూమికి అక్రమంగా లేఅవుట్లు వేసి విక్రయించారని, వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ సర్వే నెంబర్లలో భూమి క్రయవిక్రయాలకు అవకాశం లేకుండా ముందు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన కోరారు.

ఉప్పుటేరు కలుషితంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : పూడిమడకలో ఉప్పు గల్లీల మీదుగా నిర్వహిస్తున్న ఉప్పుటేరు కలుషితమవుతుందని జిల్లా కలెక్టర్కు మంగళవారం పూడిమడక గ్రామం మాజీ సర్పంచ్ చేపల వెంకటరమణ ఫిర్యాదు చేశారు. పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థ పదార్థాలు ఉప్పుటేరులో వదలడంతో మత్స్య సంపద అకాలంగా చనిపోతున్నట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. మత్స్యకారుల జీవనోపాధి నీటిపై ఆధారపడి ఉందన్నారు. వేలాది మంది జీవనం సాగించే సముద్రం నీటిలో రసాయనిక వ్యర్థ పదార్థాలు విడుదల చేయడాన్ని నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

ఎంపిపిగా బుల్లిలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని ఎ.కొత్తపల్లి ఎంపిటిసి సభ్యురాలు, వైస్ ఎంపిపి చింతల బుల్లిలక్ష్మిని ఎంపిపిగా నియమిస్తూ జెడ్‌పి సిఈఓ ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎంపిపి కిలపర్తి రాజేశ్వరి వ్యక్తిగత, అనారోగ్య కారణాలతో ఈ ఏడాది ఏప్రిల్ 15న ఎంపిపి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఎంపీపీ ఎన్నిక జరిగే వరకు బుల్లిలక్ష్మి ఎంపీపీగా వ్యవహరిస్తారని జడ్పీ సీఈఓ పోలినాయుడు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు ఎంపిడిఓ ఎస్.అప్పలరాజు తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని రావులమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985-86 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్‌కు చెందిన సలుమూరి శ్రీరాములు మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులకు ఆయన చదువుకున్న పూర్వవిద్యార్థులు రూ.40 వేలు ఆర్థిక సహాయం మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సబ్బవరపు నర్సింహమూర్తి, కామిరెడ్డి రాము, కొల్లి వెంకటరమణ, లాలం సూజాత, దొగ్గ వల్లారత్నం పాల్గొన్నారు.

ప్రభుత్వ గెడ్డవాగు ఆక్రమణ

- లే అవుట్ ఏర్పాటు
- తూతూ మంత్రంగా హెచ్చరిక బోర్డులు
- రెవెన్యూ హెచ్చరికలను పట్టించుకోని కబ్జాదారులు
- క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానికుల డిమాండ్



గెడ్డవాగును ఆక్రమించి వేసిన రోడ్డు

ప్రజాశక్తి-సబ్బవరం

మండలంలోని జివిఎంసి 88వ వార్డు వెదుర్లనరవ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 77/2లోని ప్రభుత్వ గెడ్డ వాగు స్థలాన్ని కొంత మంది ఆక్రమించారు. ఆ స్థలంలో ఆక్రమంగా లేఔట్ ఏర్పాటు చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు తూతుమంత్రంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ఊరుకున్నారు. ఈ హెచ్చరికలను కబ్జాదారులు పట్టించుకోలేదు. బరితెగించి లే ఔట్ రోడ్లు నిర్మాణం చేపట్టడంతో స్థానికులు మండి పడుతున్నారు.

మండలంలోని వెదుళ్ళనరవ సర్వే నంబర్ 77/2లో ఎకరా 8 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. గెడ్డ వాగు కిందకు వచ్చే ఈ ప్రభుత్వ భూమికి ఆనుకొని కొంత ప్రైవేటు భూమి ఉంది. ఆ భూమిలో అనధికారికంగా లే అవుట్ వేసిన కొంతమంది చోటా నాయకులు ఈ ప్రభుత్వ భూమిపై కన్నేసి చక్కగా చదును చేసి లే అవుట్ వేసి అమ్ముకోవడానికి ప్లాన్ చేశారు. కొన్ని ప్లాట్లు అమ్మకం కూడా జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఈ ప్రభుత్వ భూమి ఆక్రమణపై స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పలుమార్లు ఫిర్యాదులు రావడంతో అధికారులు భూమిని స్వాధీనం చేసుకొని ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కబ్జాదారులు తమదైన శైలిలో పెచ్చుమీరి లే ఔట్ పనులు ముమ్మరంగా చేస్తున్నారు. జివిఎంసి పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కావడంతో స్థానికుల నుండి తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు భూకబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

'స్లైలెక్స్' ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలి

మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం అందించాలి : సిఐటియు నేతలు శంకరరావు, శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనకాపల్లి

పరవాడ జవహర్ లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో మంగళవారం మధ్యాహ్నం స్మైలెక్స్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఒరిస్సాకు చెందిన కబీ అనే కార్మికుడు మృతి చెందారని, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు మృతుని కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, కోశాధికారి వివి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇటీవల అచ్యుతాపురంలో జరిగిన ప్రమాదం మరువకముందే మరో ప్రమాదం సంభవించిందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కూడా ఫార్మా పరిశ్రమల్లో భద్రత చర్యలు, ప్రమాదాలపై సమావేశాలు జరిపి వారం కాక ముందే రెండు ప్రమాదాలు జరిగాయన్నారు. పరిశ్రమలలో ముఖ్యంగా ఫార్మ పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు జరగటం, అమాయకులు మృత్యువాత పడటం దురదృష్టకరమన్నారు. పరిశ్రమలకు లాభాలే పరమావధిగా ఉంటుందని, భద్రత చర్యలు, భద్రతా ప్రమాణాలు, సేఫ్టీ ఆడిట్లు విషయంలో అత్యంత లోప భూయిష్ఠంగా మారడంతో ఈ ప్రమాదాల్లో అమాయక కార్మికులు మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది మంది ఈ జిల్లాలో ఉండే ఫార్మా కార్మికుల్లో ఏ క్షణంలో ఏమవుతుందోనని భయాందోళన వెంటాడుతుందో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రమాదం పై సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతి చెందిన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్‌పై చర్యలు

ప్రజాశక్తి కథనానికి స్పందించిన తహశీల్దారు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని దేశపాత్రునిపాలెం రెవెన్యూ రికార్డు ట్యాంపరింగ్‌పై ప్రజాశక్తి మూడు రోజులుగా ఇచ్చిన కథనాలపై తహశీల్దారు ఎస్.గణపతిరావు స్పందించారు. తహశీల్దార్ కార్యాలయంలో దేశపాత్రునిపాలెం రెవెన్యూ రికార్డులను ఒక చోటకు చేర్చుతున్నారు. భూ ఆక్రమణలపై ఈనెల 20న దేశపాత్రునిపాలెంలో భూమాయ, 21న ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఎసరు, 22న ఆ రికార్డులు ఏమయ్యాయి తదితర కథనలు ప్రజాశక్తి ప్రచురించింది. వీటికి పరవాడ తాసిల్దార్ ఎస్ గణపతి రావు స్పందించి దేశపాత్రునిపాలెం రెవెన్యూ గ్రామానికి చెందిన వివిధ సర్వే నెంబర్లు భూములు రికార్డులు కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో జిల్లా కలెక్టర్, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్ అండ్ రికార్డ్ ఏడి వారి కార్యాలయం ద్వారా తెప్పించుకొని గతంలో సిట్ అధికారులకు పంపిన నివేదికలు ప్రస్తుతం ఉన్న రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ప్రజాశక్తికి తహసీల్దార్ తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-పరవాడ : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వెన్నెలపాలెం హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను టాస్క్ ఫోర్స్ బృందం మంగళవారం పరిశీలించింది. గర్భిణీ స్త్రీల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు అమలు, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, జనని సురక్ష యోజన, మొదలగు పథకాలు పర్యవేక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్. లూసి మేడం మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలను సకాలంలో నమోదు చేస్తూ వారికి కావలసిన ప్రసూతి, వైద్య సేవలు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హారిక, జయశ్రీ కరిష్మా, డిపిహెచ్ఎన్ నాగమణి, డిపిఓ జగదీష్, ఎస్ఓఏ రామచంద్ర రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

10 వారాల ఉపాధి హామీ వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- మునగపాక : ఉపాధి కూలీలకు 10 వారాలుగా బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి కూలీలతో తోటాడ, టి.శిరసపల్లి గ్రామ సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యంత పేదలైన కూలీలకు 10 వారాలుగా వేతన బకాయిలు ఇవ్వకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. పది వారాల పాటు వేతనాలు చెల్లించకపోతే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వెంటనే బకాయిలు చెల్లించాలని, లేనట్లయితే మండల వ్యాప్తంగా ఉపాధి కూలీలను సమీకరించి ఉపాధి హామీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

బోరుబావికి మరమ్మతులు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట పూసర్ల వీధిలో పాడైపోయిన బోరు బావికి మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఈ బోరు రిపేరు కావడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేయగా, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది దీనికి మరమ్మతులు చేశారు. ఈ కార్యక్రమం టిడిపి నాయకులు కాంతమ్మ, ఈశ్వరమ్మ, మంచి నీటి విభాగం సిబ్బంది నాగేశ్వరరావు, సూరి బాబు పాల్గొన్నారు.

మునిగిన నారుమడి రక్షణపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి : నారుమడిలో చేరిన నీటిని తీసివేయడానికి మండల వ్యవసాయాధికారి ఎల్‌వై కాంతమ్మ రైతులకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని వరి నారుమళ్ళను పరిశీలించి అనంతరం ఆమె రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహనకు సైకిల్ యాత్ర

ప్రజాశక్తి-కశింకోట : పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్రం రైకిల్ గ్రామానికి చెందిన యువకుడు ఆర్‌కెఎల్.సఫీ సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ యాత్ర మంగళవారం కశింకోట మండలం బయ్యవరం చేరుకుంది ఈ సందర్భంగా ఆయన్ను ప్రజాశక్తి పలకరించగా, ఈ సైకిల్ యాత్ర చేపట్టి 14వ రోజులైందని తెలిపారు తాను నిరుపేద కుటుంబంలో జన్మించానని, పదవ తరగతి చదువుకున్నానని, వెల్డింగ్ పని చేస్తున్నానని చెప్పారు. తండ్రి చనిపోగా, తల్లి, అక్క, తను ఉంటున్నట్లు చెప్పారు. ఈ యాత్ర కన్యాకుమారి వరకు కొనసాగుతుందని తెలిపాడు, మొక్కలు నాటి అడువులు పెంచాలని సూచించారు.

భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ ప్రారంభం

ప్రజాశక్తి-కశింకోట : స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థులకు ఫిజియో థెరపీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల విద్య శాఖాధికారి చిట్టి బాబు మాట్లాడుతూ మండలంలోని మానసిక వికలాంగు విద్యార్థులు ఈ ఫిజియోథెరపీని ఉపయోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు కె.వెంకటేశ్వరరావు, నెంబర్-2 స్కూల్ ప్రధానోపాధ్యాయులు రామునాయుడు, భవిత కేంద్రం ఉపాధ్యాయులు బి.వి.రమణమ్మ, దీపా, గీత మోనికా పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట మండలం జామదులపాలెం గ్రామపంచాయతీలో పండ్ల తోటల పెంపకంలో భాగంగా 40 ఎకరాలు గుర్తించబడిన రైతులతో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషు బాబు మాట్లాడుతూ మొక్కలకు గుంతలు తీసిన దగ్గర నుండి ప్లాంటింగ్ పూర్తయ్యే వరకు ఏ దేనికి ఎంతెంత పేమెంట్ వస్తుందో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎపిఓ శివ, కరక శేషు, ఒమ్మి కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

బస్ కాంప్లెక్స్ బురదమయం

ప్రజాశక్తి- కశింకోట : వర్షాలకు కశింకోటలోని బస్సు స్టాండ్ బురదమయం అవుతోంది. దీంతో ప్రయాణికులు ఆ బురదలోనే వెళ్లి బస్సులు ఎక్కుతున్నారు. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు బస్ స్టాండ్ ఆవరణలో ఉన్న గోతుల్లో వర్షపు నీరు చేరి బురదమయంగా మారింది. ఎర్ర మట్టి వేయడం వల్ల వర్షం పడితే చిత్తడిగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు ఈ గోతులను పూడ్చి కంకరమట్టి వేయాలని, లేదంటే సిమెంట్ రోడ్డు వేయాలని కోరుతున్నారు.



దమ్ముమడిని తలపించేలా ఉన్న కశింకోట బస్ కాంప్లెక్స్

శ్మశానవాటికలో అన్నీ సమస్యలే!

- అస్తవ్యస్త రహదారితో వెళ్లేందుకు అగచాట్లు
- నిండా తుప్పలతో అంత్యక్రియలకు అవస్థలు
- బోరు పాడై, నెలలు గడుస్తున్నా పట్టని వైనం



తుప్పలతో నిండిపోయిన ఎఎల్.పురం శ్మశాన వాటిక

ప్రజాశక్తి- గొలుగొండ : మండలంలో మేజర్ పంచాయితీ ఏఎల్.పురం శ్మశానవాటిక అస్తవ్యస్తంగా వుంది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షానికి శ్మశానానికి వెళ్లే మార్గమంతా బురదయంగా మారింది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే శ్మశాన వాటికకు తీసుకెళ్లి, అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబీకులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. మృతదేహాన్ని పాడెపై మోసుకుంటూ శ్మశాన ఆవరణలోకి అడుగుపెట్టేందుకు పడే ఇబ్బందులు చెప్పలేమని అంటున్నారు. బురద మార్గంలో అష్టకష్టాలు పడి, మృతదేహాలను శ్మశానంలో శవపేటిక వద్దకు తీసుకెళ్లిన తర్వాత అంత్యక్రియలకు ఇంకా కష్టపడక తప్పడం లేదని అంటున్నారు. శ్మశానవాటికలో ఉన్న ఒకేఒక బోరు చెడిపోవడంతో నీటిఎద్దడి ఏర్పడింది. సమీపంలో నదీ ప్రవాహం ఉన్న అక్కడికి వెళ్లేందుకు బురదలో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి. దీంతో శ్మశానానికి వెళ్ళిన వారంతా తూతూ మంత్రంగా అంత్యక్రియలు జరిపేస్తున్నారు. శవాన్ని ఖననం చేసే ప్రాంతం, విశ్రాంతి భవనాల చుట్టూ తుప్పలు ఏపుగా పెరిగిపోయాయి. శ్మశాన వాటికను శుభ్రం చేయించాల్సిన పంచాయతీ అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. గ్రామాల్లో జీవనానికి కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడడం మాట అటుంచితే, అంతిమ సంస్కారాలకు అంతకు మించి కష్టాలు ఉండడం విచారకరమని పలువురు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు స్పందించి శ్మశానానికి వెళ్లే మార్గాన్ని బాగుచేయడంతోపాటు, శ్మశానవాటికలోని తుప్పలను తొలగించాలని, ఉన్న ఒకేఒక్క చేతి బోరుకు మరమ్మత్తులు చేయించి, నీటికష్టాలు తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



బురదమయంగా ఉన్న శ్మశానవాటికి దారి

రంగురాళ్ల క్వారీలపై పటిష్ట నిఘా



సాలికమల్లవరం రంగురాళ్ళ క్వారీని పరిశీలిస్తున్న అటవీ రేంజర్

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో రంగు రాళ్ళ క్వారీల్లో ఎవరైనా తవ్వకాలు చేపట్టినా, అక్రమ తవ్వకాలను ప్రోత్సహించినా కఠిన చర్యలు చేపడతామని అటవీ శాఖ నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనరస హెచ్చరించారు. మంగళవారం మండలంలోని సాలికమల్లవరం, ఆరిలోవ అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ళ క్వారీలను సందర్శించారు. ఈ సందర్భంగాస్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని కరక, సాలిక మల్లవరం, ఆరిలోవ అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల క్వారీల్లో ఎటువంటి తవ్వకాలు చేపట్టిన ప్రోత్సహించిన కఠిన చర్యలు చేపడతామన్నారు. ఆయా క్వారీల పరిధిలో నిరంతరం పెట్రోలింగ్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ గార్డు ఇందిరాదేవి పాల్గొన్నారు.

పప్పుశెట్టిపాలెం క్వారీ వద్ద ప్రత్యేక నిఘా

మండలంలో పప్పు శెట్టిపాలెం గ్రామంలో రంగురాళ్ల క్వారీ వద్ద కూడా ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేసినట్టు గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. క్వారీ వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, క్వారీ ప్రాంతంలో ఎవరైనా గుంపులుగా, అనుమానాస్పదంగా సంచరిస్తే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

రహదారి నాణ్యతపై తనిఖీలు



రోడ్డు నాణ్యతను తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేట నుంచి సీహెచ్ఎల్ పురం వరకూ గత ఏడాది చేపట్టిన రహదారి నిర్మాణ పనులను మంగళవారం ఉన్నతస్థాయి నాణ్యతా కమిటీ బృందం అధికారులు పరిశీలించారు. గత ఏడాది రూ. 3.20కోట్ల వ్యయంతో 8.50కిలోమీటర్ల రహదారిని నిర్మించారు. రహదారి నాణ్యత ప్రమాణాలపై కేంద్ర కమిటీ ప్రతినిధి బినయ్‌సింహ్ తనిఖీలు నిర్వహించారు. డిఇఇ ఎన్.కుమార్‌రాజు,ఎఇఇ ఎస్‌వి రాజు ఉన్నారు కాగా మూడేళ్ల పాటు ఈ రహదారి నిర్వహణా బాధ్యతలను సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టాల్సి ఉంది.

రాజధానికి నిధులు కేటాయింపుపై హర్షం



స్వీట్లు పంచి పెడుతున్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-నక్కపల్లి: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఎపి రాజధాని అమరావతికి నిధులు కేటాయించడంపై కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు నక్కపల్లిలో కూటమి నాయకులు బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంచారు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ 2024-25 సంవత్సర బడ్జెట్‌ను మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు, పోలవరానికి, వైజాగ్ చెన్నై- ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నిధులు కేటాయించడం శుభపరిణామమన్నారు. సాధ్యమైనంత త్వరలోనే పోలవరం కాలువ పూర్తి చేస్తామని చెప్పడం, ఇతర పనులకు సానుకూలంగా స్పందించి, నిధులు కేటాయించడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోసూరి శ్రీనివాసరావు మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ, దేవరపు లోవరాజు, కోసూరి నానిబాబు, బద్రి, రాంబాబు, జెట్టి రాజు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - నాతవరం : జిల్లాలో చెరువులు, గెడ్డం పోరం బోకులు, ల్యాండ్‌సీలింగ్, వక్ఫ్, దేవాదాయ, అనాధీన, గయ్యాళి, ఇతర ప్రభుత్వ నిషేదిత జాబితాల భూముల అన్యాక్రాంతం, దురాక్రమణపై చర్యలు తీసుకోవాలని జిల్లా చెరువుల పరిరక్షణ సమితి కన్వీనర్‌గా లాలం వెంకట రమణారావు కోరారు. గ్రామ , మండల, జిల్లా స్థాయిలో పలువురు కబ్జాదారులు, రియల్టర్లు ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు పాల్పడి సొమ్ము చేసుకుంటున్నారని, వాటన్నింటిపై సర్వే నిర్వహించి, వెనక్కు తీసుకోవడంతోపాటు బాధ్యులపై చట్టపరమైన కఠిన క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు. భూబదలాయింపు నిషేధ చట్టం 1977ను పకడ్బందీగా అమలు చేయాలని కోరారు.

నేరేడు చెట్లు నరికివేతపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కోటవురట్ల: మండలంలో కోటవురట్ల గ్రామంలో సర్వేనెంబర్ 413లో పల్లెల నాగేశ్వరరావు భూమిలో 30 సంవత్సరాల క్రితం నాటి నేరేడు చెట్లను ఇటీవల లింగాపురం గ్రామానికి చెందిన కర్రల వ్యాపారి రాజాన రామకృష్ణ దొంగతనంగా నరికి తీసుకెళ్లారని ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రమణయ్యకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు

వైసిపి ధర్నాకు ఢిల్లీకి పయనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ఢిల్లీలో వైసిపి నిర్వహించ తలపెట్టిన ధర్నాలో పాల్గొనేందుకు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ మంగళవారం పయనమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసిపి శ్రేణులపై కూటమి నేతల దాడులకు నిరసనగా బుధవారం ఢిల్లీలో చేపట్టే వైసిపి ధర్నాకు మాజీ సిఎం జగన్ పిలుపుమేరకు వెళుతున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలంలో కవగుంట గ్రామంలో రావికమతం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి, 65 మందికి వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పి కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాల వల్ల వాతావరణ మార్పులతో జలుబు, దగ్గు, జ్వరం తో పాటు పలు రకాల రోగాలు సోకే అవకాశం ఉందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. . డయేరియా, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యసేవలు పొందాలని సూచించారు. విషయమైతే రావికమతం పిహెచ్‌సిలో వైద్యులను సంప్రదించాలన్నారు. సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఎఎన్‌ఎం వరలక్ష్మి,డిఎఒ మహేష్, ఎంఎల్‌హెచ్‌పి కుమారి, ఆశాలు పాల్గొన్నారు.

బదిలీలకు ఎదురుచూపులు!

అనుకూల ప్రదేశాలకు వెళ్లేందుకు అపుడే పైరవీలు

ప్రజాశక్తి -కోటవురట్ల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు పూర్తికావస్తోంది ఇప్పటికే జిల్లాస్థాయి అధికారుల బదిలీలు ప్రక్రియ పూర్తికాగా, డివిజన్ స్థాయి అధికారుల తోపాటు మండల స్థాయి అధికారులు, తహశీల్దార్, ఎంపిడిఒ, ఎస్ఐ, ఇంజినీర్లు, ఇతర మండల స్థాయి అధికారులు బదిలీలపై సర్వత్రా ఎదురుచూస్తున్నారు.



ఎన్నికల ప్రక్రియలో భాగంగా అంతరజిల్లాలకు బదిలీ అయిన వారంతా తిరిగి తమకు అనువైన, సొంత ప్రాంతాలకు ఇప్పుడు బదిలీపై వెళ్లేందుకు పావులు కదుపుతున్నారు, గతంలో పనిచేసిన ప్రాంతానికి రావాలని ఎదురుచూస్తున్నారు, దీని కోసమే మంత్రులు ఎమ్మెల్యేలు స్థానిక నాయకుల వద్ద ప్రదక్షిణలు చేస్తున్నారు, ఇప్పటికే తహశీల్దార్ బదిలీలకు సంబంధించి ప్రక్రియ దాదాపు పూర్తయిందని, నేడో,రేపో కలెక్టర్ ప్రకటించే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

మండల స్థాయి అధికారుల బదిలీల అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది బదిలీలు జరగడంతో, బదిలీల కోసం ఆందోళనతో ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికే గ్రామ స్థాయి అధికారుల ట్రాక్ రికార్డులను జిల్లాస్థాయి అధికారులకు పంపేందుకు సిద్ధం చేశారు. కిందిస్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బందిని సొంత మండలాల్లో కాకుండా వేరే మండలాలకు బదిలీ చేసే ఆలోచనలో జిల్లా స్థాయి అధికారులు ఉన్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది, ఇప్పటికే మండలంలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకుని ఉన్న గ్రామస్థాయి అధికారులను వేరే గ్రామానికి మారుస్తారా లేక వేరే మండలాలకు మారుస్తారా అన్న విషయంపై క్లారిటీ లేకపోవడంతో వారంతా ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.గ్రామస్థాయి అధికారులు సైతం ఎవరి ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు, ఎమ్మెల్యే, మండలస్థాయి నాయకులను కలుస్తూ, బదిలీలు జరిగితే తమకు అనుకూలమైన ప్రదేశాలకు వెళ్లేలా పైరవీలు మొదలెట్టేశారు.

ఆధార్ సేవలకు ప్రత్యేక శిబిరాలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని నక్కపల్లి, దోసలపాడు సచివాలయాల్లో మంగళవారం ఆధార్ మెగా డ్రైవ్‌ను ప్రారంభించారు. పలువురు ఆధార్ నమోదు, సవరణలు చేయించుకున్నారు. మెగా డ్రైవ్‌లో సిబ్బంది ఆధార్ నమోదు అప్‌డేట్ చేయడంతో పాటు మార్పులు, చేర్పులు వంటి సేవలను అందిస్తున్నారు.మండలంలో పలు గ్రామాల్లో ఈనెల 27వ తేదీ వరకు ఆధార్ నమోదు శిబిరాలను నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాస్ అన్నారు.

డొంకాడలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో కొత్తఎల్లవరం పంచాయతీ శివారు డొంకాడ గ్రామంలో మంగళవారం చీడిగుమ్మల పిహెచ్‌సి వైద్యాధికారులు బుద్ధా ధనుంజయ, మధుసూధనరావు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. డొంకాడ గ్రామంలో జ్వరాలు, సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.. శిబిరంలో నర్సీపట్నం డిఎల్‌పిఒ మూర్తి, ఎంపిడిఒ రత్నకుమారి, ఇఒపిఆర్‌డి రమణి, సర్పంచ్ కొల్లు రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ వెంకటలక్ష్మి, ఎఎన్ఎం లోవలక్ష్మి, ఆశారేవతి, సంగీత పాల్గొన్నారు.

కెప్టెన్ లక్ష్మీ సెహగల్‌కు ఐద్వా ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం సిఐటియు కార్యాలయంలో కెప్టెన్ లక్ష్మిసెహగల్ వర్ధంతిని ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ట్రెజరర్ కెవి.సూర్యప్రభ మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటంలో సుభాస్ చంద్రబోస్ నిర్మించిన మహిళా సైనిక దళంలో కెప్టెన్‌గా లక్ష్మిసెహగల్ పనిచేసారన్నారు. వృత్తిరీత్యా డాక్టర్ కావడంతో సైన్యానికి, పేద ప్రజలకు వైద్య సేవలు అందించారన్నార. ఐద్వా జిల్లా జాతీయ నాయకులుగా బాల్య వివాహాలకు, మద్యపానం, మహిళలపై జరుతున్నా హింసా, అత్యాచారాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నడిపారన్నారు. మహిళలు సమస్యల పరిష్కారానికి, మహిళలను చైతన్యం కల్పించేందు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ, కే.ప్రసన్న, ఎల్.లక్ష్మీ, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, అడిగర్ల రాజు, ఎస్.సత్తిబాబు, కే.శ్రీనివాసరావు, డి.శివ పాల్గొన్నారు.

కిలో టమాటా రూ.54కే

- నేడు రైతు బజార్లలో విక్రయాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: విశాఖపట్నం జిల్లాలోని అన్ని రైతు బజార్లలో బుధవారం టమోటా కిలో రూ.54 చొప్పున వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామనిజాయింట్ కలెక్టర్, రైతు బజార్ల చైర్మన్ కె. మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం టమోటా ధర విపరీతంగా పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్కెటింగ్ శాఖ, చిత్తూరు జిల్లా నుండి టమోటాలను కొనుగోలు చేసి వినియోగదారులకు బహిరంగ మార్కెట్లో ధర కన్నా తక్కువ ధరకు రైతుబజార్లుతో విక్రయించే చర్యలు చేపడుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేంద్రియ ఎరువుల తయారీ ముమ్మరం చేయండి



పంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ శిరీషారాణి

ప్రజాశక్తి -గొలుగొండ: చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలన్నింటిలోనూ గతంలో మాదిరిఆగా వానపాములతో సేంద్రియ ఎరువులు తయారీని ముమ్మరం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి ఆదేశించారు. మంగళవారం గొలుగొండ మండలంలో చీడిగుమ్మల ,పాకలపాడు, కొత్త యల్లవరం పంచాయతీల్లో పర్యటించారు. చీడి గుమ్మల , పాకలపాడు గ్రామాల్లో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాల పనితీరును పరిశీలించారు. పాకలపాడు కేంద్రంలో పనితీరు బాగుందని, చీడిగుమ్మల కేంద్రంలో పనితీరు మెరుగుపడాలని సిబ్బందికి సూచనలు అందజేశారు. (చెత్త నుండి సంపద కేంద్రాల్లో ఎరువులు తయారీకి కావలసిన ఏర్పాట్లను సిబ్బంది సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాల కారణంగా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులంతా పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులపై దృష్టిపెట్టాలని దిశా నిర్దేశం చేయడంతోపాటు నిరంతరం పర్యవేక్షించాలని ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిలను ఆదేశించారు. చీడిగుమ్మల పిహెచ్‌సిని సందర్శించారు. కొత్త ఎల్లవరం పంచాయతీ శివారు డొంకాడలో నిర్వహించిన వైద్య శిబిరంలో పాల్గొని, పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్ర కోఆర్డినేటర్ నాగలక్ష్మి , ఎంపిడిఒ రత్నకుమారి, ఇఒపిఆర్‌డి రమణి, పంచాయతీ కార్యదర్శులు రఘురాం, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే!

- తహశీల్దార్ కార్యాలయంలో ఎటుచూసినా తడే
- నిరంతరం చిమ్ముతున్న పైకప్పు, గోడలు
- విధుల నిర్వహణకు ఉద్యోగుల అగచాట్లు
- తలకుమించిన భారంగా రికార్డుల భద్రత



నిండా తడితడిగా ఉన్న కార్యాలయం లోపలి భాగం



పైకప్పు నుంచి చిమ్ముతున్న వర్షపునీరు

ప్రజాశక్తి- కోటవురట్ల: ఎడతెరిపిలేని వర్షం కురుస్తూ ఉండడంతో కురుస్తున్న వర్షాలకు తాహసిల్దార్ కార్యాలయం లోపల వర్షపు నీరు చిమ్మడంతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనంలోని అన్ని గదుల్లోనూ వర్షపు నీరు పడుతూ ఉండడం పట్ల ఆందోళన చెందుతున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం దాదాపు శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పుతోపాటు గోడలు, అన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో, బయట వర్షం వెలిసిపోయినా, భవనంలోపల మాత్రం నాలుగైదు రోజులు వరకు నీరు చిమ్ముతూనే ఉంటోంది. దీంతో సిబ్బంది కూర్చుని విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడడంతోపాటు, ప్రధానంగా రికార్డులను సురక్షితంగా భద్రపరచడం కష్టమౌతోందని ఉద్యోగులు వాపోతున్నారు.దీనికి తోడు సిబ్బంది వాడుకునే మరుగుదొడ్లు సైతం పూర్తిగా పాడై అధ్వానస్థితికి చేరుకోవడంతో అత్యవసరమైనా వాడలేని పరిస్థితి ఉందని అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టిసారించి, చినుకు రాలితే తహశీల్దార్ కార్యాలయంలో నెలకొన్న ఇబ్బందులు పరిస్థితులను పరిష్కరించడంతోపాటు ఇతర సౌకర్యాలను సమకూర్చాలని కోరుతున్నారు. ప్రస్తుతమున్న భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో, దీనికి మరమ్మతులు చేయడం, పైపైనే మెరుగులు దిద్దం కంటే కొత్త భవనం పునర్నిర్మించడమే మేలనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలి

25, 26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయండి



గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు నేత జగన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పోర్టుల ప్రైవేటీకరణ ఆపాలని వాటర్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) జాతీయ కార్యదర్శి బి.జగన్ డిమాండ్ చేశారు. మేజర్ పోర్టులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖపట్నం పోర్టులో సెక్షన్ క్వారీగా గేట్ మీటింగులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టుగా మార్చడానికి, మరింత దేశ,విదేశీ ప్రైవేట్ కంపెనీలను ఆకర్పించడానికి షిప్పింగ్ మినిస్ట్రీ మోడల్ కన్సెషన్ అగ్రిమెంట్(ఎంసిఎ)లో చాలా మార్పులు చేసిందన్నారు. 2030నాటికి 80 శాతం మేజర్ పోర్టులను ల్యాండ్ లార్డ్ పోర్టులుగా మార్చే లక్ష్యాన్ని పెట్టుకున్నారని, అందులో విశాఖపట్నం పోర్టు కూడా ఉందన్నారు. ఇప్పటికే కేంద్ర మంత్రి ప్రకటించినట్లు మేజర్ పోర్టుల్లో అధునాతన పోర్టు జెఎన్‌పిటిని 100 శాతం ల్యాండ్‌లార్డ్ పోర్టుగా మార్చేసారన్నారు. దీంతో జెఎన్‌పిటిలోనున్న అన్ని బెర్తులు, అన్ని విభాగాలు పిపిపి మోడల్ ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పజెప్పారన్నారు. మేజర్ పోర్టులను, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేయరాదని డిమాండ్ చేశారు .సుప్రీంకోర్టు తీర్పు-2017 ప్రకారం పోర్టు పూల్ కళాసీలను పర్మినెంట్ చేయాలని, పోర్టు పూల్ కళాసీలను ఖాళీ పోస్టుల్లో భర్తీ చేయాలని, సిహెచ్‌డి క్యాజువల్ కార్మికులను పర్మినెంట్ చేసి, అగ్రిమెంట్ ప్రకారం తక్షణం వేతనం పెంచాలన్నారు. ఎపి హైకోర్టు తీర్పును గౌరవించి సిహెచ్‌డి ఆఫీస్ సైడ్ క్యాజువల్స్‌ను పోర్టు యాజమాన్యం తక్షణం రెగ్యులర్ చేయాలన్నారు .సిహెచ్‌డి షోర్‌లేబర్, లైన్ పికర్స్‌కు, అన్ని రకాల స్టీవ్ డోర్ కార్మికులకు చట్ట ప్రకారం అన్ని హక్కులు కల్పించాలన్నారు విశాఖ పోర్టులో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మికులకు నష్టదాయికమైన 4-లేబర్ కోడ్ లను రద్దు చేయాలని కోరారు. దీనిపై ఈ నెల 25,26 తేదీల్లో పోర్టు వద్ద నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు సాంబమూర్తి,ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ విడిఎల్‌బి యూనియన్ అధ్యక్ష ,కార్యదర్శులు జక్కన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, నాయకులు రామలింగేశ్వరరావు, త్రినాథరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఆర్‌టిసి ఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, అద్దెబస్ డ్రైవర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నేతలు కోరారు. మంగళవారం ప్రజారవాణాశాఖ విశాఖ రీజియన్ మేనేజర్ ఎ. అప్పలరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. సుమారు గంటన్నర పాటు ఆర్‌ఎం తోవివిధ సమస్యలపై చర్చించారు. చర్చల సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్.వి కుమార్, ఆర్‌టిసి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసిరామ్,జిల్లా కార్యదర్శి పి. వెంకటరావు మాట్లాడుతూ ముఖ్యంగా ఎపిపిటిడి ఎండి ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం కార్మికులందరికీ కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ వర్తింపు చేయాలని కోరారు. బస్‌పాస్ సెక్షన్, టికెట్ కౌంటర్, లాజిస్టిక్, అద్దె బస్ డ్రైవర్లకు ప్రతినెలా ఒకటిన జీతాలు చెల్లించాలని,డ్రైవర్స్ రిక్యూట్‌మెంట్‌లో అద్దె బస్ డ్రైవర్లుకు ప్రాధాన్యత ఇవ్వాలని,ప్రభుత్వ జివో ప్రకారం కార్మికులకు జీతం చెల్లించాలని, వారాంతపు సెలవులు, పండగ సెలవులు వర్తింప చేయాలని కోరారు. ఆర్‌టిసి యాజమాన్యం ఇస్తున్న సర్క్యులర్లను కార్మికులకు తెలిసే విధంగా నోటీసు బోర్డులో డిస్‌ప్లే చేయాలని కోరారు.దీనికి ఆర్‌టిసి ఆర్‌ఎం గారు స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. మిగతా వాటిని ఎండి దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కార్మికులకు సమాచారం తెలిసే విధంగా నోటీసు బోర్డులో సర్క్యులర్ డిస్‌ప్లే చేస్తామన్నారు.

గుర్తింపు కార్డులపై కౌలు రైతులకు అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎఒ అప్పారావు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : మండలంలోని గబ్బాడ గ్రామ సచివాలయం వద్ద కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఈర్ల రాజేశ్వరి మాట్లాడుతూ భూయాజమానికి నష్టం కలగకుండా, కౌలుదారునికి ప్రయోజనాన్ని చేకూర్చే గుర్తింపు కార్డులను కౌలురైతులంతా వియోగించుకోవాలని కోరారు.

మండల వ్యవసాయాధికారి డి.అప్పారావు మాట్లాడుతూ 11 నెలల కాల వ్యవధితో సిసిఆర్‌సి కార్డులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్డులు పొందటం ద్వారా పంటపై సర్వ హక్కులు సాగుదారునికి చెందుతాయన్నారు. తద్వారా రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ శాఖ ద్వారా అందించే ఇతర పథకాలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్టపరిహారం, పంట రుణాలు, పంట అమ్మకం సాగుదారుని పేరు మీద చేసుకోవచ్చని సూచించారు. అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రాజునాయుడు, మాజీ ఎంపిటిసి ఈర్లె రాజుబాబు, గ్రామ రైతులు, కౌలుదారులు, విఆర్ఒ సింహాచలం, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే రూ.వెయ్యి జరిమానా

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: సెక్షన్ 129 ప్రకారం ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుంటే రూ.1000, జరిమానాతో పాటు, 3 నెలలు లైసెన్సు సస్పెండ్ చేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రాజరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. .హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడిపితే మోటారు వాహనాల చట్టం,సెక్షన్ 194 డి ప్రకారం మొదటి నేరానికే రూ.1000, జరిమానాతో పాటుగా 3 నెలలు పాటు డ్రైవింగ్ లైసెన్సును సస్పెండ్ చేస్తామన్నారు. జనవరి నుండి ఇప్పటి వరకు 1162 కేసులు నమోదు చేశామన్నారు. దీనిపై జిల్లాలో విస్తృతంగా తనిఖీలు చేపడతామన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, కేసుల నుంచి తప్పించుకోవాలని సూచించారు.